క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

కాటారం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో రేపు(శుక్రవారం) ఎంపీపీ పంతకాని సమ్మయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంకర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్షా, అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరై సమావేశం విజయవంతం చేయాలని కోరారు.

దోమల నివారణకు ఫాగింగ్



మహాముత్తారం: వర్షాకాలం కావడంతో గ్రామంలో సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు ముందస్తు చర్యలో భాగంగా దోమల నివారణకు మండలంలోని మాదారం గ్రామంలో సర్పంచ్ అజీమా బేగం ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది బుధవారం ఫాగింగ్ చేపట్టారు. ఫాగింగ్ మిషన్ ద్వారా గ్రామంలోని వివిధ వార్డుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

సన్మానం



కాటారం: రిపోర్టర్స్ డేను పురస్కరించుకొని మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం పాత్రికేయులను సన్మానించారు. శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ పంతకాని సమ్మయ్య మాట్లాడుతూ.. సమాజంలో పాత్రికేయుల పాత్ర ఎనలేనిది అన్నారు. సమాజంలోని మంచి చెడులను వెలికితీసి సమాజశ్రేయస్సు కోసం పాత్రికేయులు చేస్తున్న కృషి వెలకట్టలేనిది అని కొనియాడారు. వారిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, మహిళా అధ్యక్షురాలు, ఎంపీటీసీ జాడి మహేశ్వరీ, సర్పంచ్ రఘురాం, నాయకులు చీమల వెంకటస్వామి, కొట్టె ప్రభాకర్, చీమల రాజు, పసుల రాజమౌళి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కొత్తపెల్లి గ్రామంలో శ్రీ అంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, పీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, నాయకులు మేకల భిక్షపతి, భూతం నర్సయ్య, దేవేందర్ తదితరులు ఉన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

మల్హర్ : మండల కేంద్రం తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో నేడు(గురువారం) లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 50 కల్యాణలక్ష్మి చెక్కులు జారీ అయినట్లు తహసీల్దార్ తెలిపారు. ఉదయం 10.30 గంట లకు మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు.

భూపాలపల్లి అర్బన్: ఊట్టికొడుతున్న చిన్నారులు



మహదేవపూర్‌లో..



టేకుమట్ల: ఉట్టి కొడుతున్న విద్యార్థి అభినవ్



పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని పలు విద్యాసంస్థలలో నేడు(గురువారం) కృష్ణాష్టమిని పురస్కరించుకొని బుధవారం ముందస్తుగా వేడుకలను నిర్వహించుకున్నారు. విద్యార్థులకు శ్రీకృష్ణ, గోపికల రూపాలతో ముస్తాబయ్యారు. ఉపాధ్యాయులు ఊట్టి కొట్టించే కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండల కేంద్రంలోని వాణి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తుగా విద్యార్థులతో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రజినీకుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా పదో తరగతి విద్యార్థి అభినవ్ ఉట్టి కొట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమన్, రాజు, రవీందర్, ఐలయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాటారం: మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్, కాకతీయ వివేకానంద పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించారు. అనంతరం చిన్నారుల కేరింతలు, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో ఆదర్శ హై స్కూల్ చైర్మన్ జనగామ కరుణాకర్, కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు, వివేకానంద కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ కృషిత, వందన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామంలోని రైజింగ్‌సన్ హైస్కూల్‌లో ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాడెంట్ ఆకుల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో విద్యార్థులు ఉట్టి కొట్టారు.



కాటారం: వివేకానంద పాఠశాలలో ఉట్టి కొడుతున్న చిన్ని కృష్ణుడు





భూపాలపల్లి అర్బన్: శ్రీకృష్ణ, గోపిక వేషధారణలో చిన్నారులు

మహాముత్తారం: కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని మండలంలోని ములుగుపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం చిన్నారులకు కృష్ణుడి, గోపిక వేషధారణ వేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ దూలం మల్లయ్య టెంకాయకొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మీనా, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీల, స్వప్న, రాజసమ్మక్క, లక్ష్మి, చిన్నారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్: మండల కేంద్రంలోని రైజింగ్ స్టార్ ప్రైవేట్ పాఠశాలలో బుధవారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహంచారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ రాణిబాయి, అటవీ క్షేత్రాధికారి (ఎఫ్ఆర్ఓ) కమల, పాఠశాల కరస్పాండెంట్ మంజుల రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిట్యాల: ఉట్టి కొడుతున్న చిన్నారి



మహాముత్తారంలో..

కిచెన్ గార్డెన్ సందర్శన



గార్డెన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పలిమెల: పలిమెల మండలం దమ్మూరు గ్రామ పంచాయతీ పరిధిలోని బూర్గుగూడెంలో పంచాయతీ సెక్రటరీ మదన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి, ఏపీఓ సునీత బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో కిచెన్ గార్డెన్లు పెంచాలని సూచించారు. అందులో కూరగాయలు పండించాలని చెప్పారు.

సీసీ నాగరాజును సస్పెండ్ చేయాలి



ఆందోళన చేస్తున్న వీఓఏలు

మల్హర్: ఐకేపీ సీసీ నాగరాజును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కొయ్యూరు ఐకేపీ కార్యాలయం ఎదుట బుధవారం మల్హర్, కాటారం వీఓఏలు బైఠాయించి ధర్నా, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీఓఏ పద్మపై వాట్సప్ గ్రూప్‌లో నాగరాజు రాత్రి వేళల్లో అసభ్యకరంగా మెసెజ్‌లు చేసి, వేధిపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. విధులు సక్రమంగా నిర్వహిస్తున్న సరిగా పని చేయడం లేదంటూ ఫోన్లో వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి అతడిని వెంటనే సస్పెండ్ చేసి, భాదితురాలికి బహిరంగ క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై నాగరాజును వివరణ కోరగా కార్యాలయం పనులు త్వరగా పూర్తి చేయాలని మాత్రమే అడిగాను, ఎవరిని కూడా మానసికంగా ఇబ్బందులకు గురి చేసే విధంగా ఎలాంటి మెసేజ్‌లు చేయలేదని తెలియజేశారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



పరామర్శిస్తున్న సత్యనారాయణరావు

చిట్యాల: పిడుగుపాటుకు గురై మృతి చెందిన చిలువేరి సరిత, నేర్పాటి మమతల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని పీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సవిల్ ఆస్పత్రి వద్ద పోస్టుమార్టం గదిలో ఉన్న మృతదేహాలకు ఆయన నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబాల వైపు స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ కనీసం చూడకుండా ఉండడం అన్యాయమన్నారు. పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఒక్కొక్క కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. అలాగే గుంటూరుపల్లి గ్రామంలో మృతి చెందిన మన్నెం సుబ్బమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి కొమురయ్య, ఎంపీటీసీ దబ్బెట అనిల్, జిల్లా, మండల నాయకులు మధు వంశీకృష్ణ, దొడ్డి కిష్టయ్య, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ మక్కెన కార్తీక్, సాంబశివరావు, శ్రీనివాస్, కుమార్, మల్లేష్, మార్కెండయా, శివ రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

మల్హర్: పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుపై కాటారం పీఏసీఎస్ చైర్మన్ నారాయణరెడ్డి అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కొయ్యూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో పార్టీ నిర్వహించిన పలు సమావేశాల్లో పార్టీ టికెట్ ఎవరికి కేటాయించినా గెలిపిస్తాం, గెలిపించే బాధ్యత నాదిని నారాయణరెడ్డి ప్రగాల్భాలు పలికాడని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీని బలహీన పర్చడానికే ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నాడని ఆరోపించారు. ఇకపై ఇలాంటివి మానుకోక పోతే అధిష్టానానికి ఫిర్యాదు చేసి పార్టీ నుంచి బయటకు పంపాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్క ప్రకాశ్‌రావు, రైతుబంధు మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు, మండల నాయకులు కోట రవి, వాల యాదగిరిరావు, కాళేశ్వరం డైరక్టర్, మండల అధికార ప్రతినిధి బండి రాజయ్య, మల్లేష్, సమ్మయ్యనాయక్, సాంబయ్య, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మహిళలకు అండగా షీ టీమ్స్



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై తమాషారెడ్డి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పలిమెల: మహిళలు, యువతులు, బాలికలకు షీ టీమ్స్ అండగా ఉంటోందని ఎస్సై తమాషా రెడ్డి తెలిపారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా పలిమెల మండలంలోని పంకెన గ్రామంలో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆపదలో ఉన్నప్పుడు మహిళలు, బాలికలు షీ టీమ్స్‌ను సంప్రదించి రక్షణ పొందాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులకు గ్రామస్తులు ఆశ్రమం ఇవ్వొద్దని అన్నారు. మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో తనిఖీలు నిర్వహించి 5లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

సైబర్ జాగృతి దివస్‌లో పంకెన గ్రామంలోని కస్తూర్బా విద్యార్థినులకు సైబర్ నేరాలపై ఎస్సై తమాషా రెడ్డి అవగాహన కల్పించారు. ప్రతీఒక్కరు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్స్, లింక్స్‌లు, మెసేజ్‌లు వచ్చే స్పందించవద్దని వివరించారు. విద్యార్థులు ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి అర్బన్: గణపురం మండలం కేంద్రలోని వడ్డెర సంఘానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రవి, మండల అధ్యక్షుడు శివరాత్రి సారయ్య, కుల పెద్దమనిషి దండుగుల రవీందర్, మరో 50మంది పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి వ్యవసాయ శాఖ మార్కెట్ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహరావు, పీఏసీఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణ చందర్‌రెడ్డి, సర్పంచ్ సుధాకర్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి

చిట్యాల: ఓటు హక్కుపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని భూపాలపల్లి ఆర్డీఓ కె.రమాదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎలక్ట్రోల్ మొబైల్ వాహనంలో ఈవీఎం, బ్యాలెట్ బాక్స్ ద్వారా ఓటు వినియోగించుకునేందుకు రెవెన్యూ సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రచార రథంతో ప్రతి గ్రామంలో తిరుగుతూ ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో మా సిబ్బందిచే అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో బీఎల్ఓలకు, సూపర్‌వైజర్లకు, ఓటర్ నమోదు కార్యక్రమంపై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుమన్, డీటీ శివతేజ్, ఆర్ఐ రాజు, తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎం ద్వారా అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ

‘పది’లో మెరుగైన ఫలితాలు సాధించాలి

వెంకటాపురం(కె): పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో 10/10 సాధించాలని ఏటీడీఓ దేశిరాం అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఏజీహెచ్ఎస్ చిరుతపల్లి-2 పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ప్రభుత్వం అందించిన డైరీలు, నోటుబుక్స్, ఇతర సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు సాధించేందుకు విద్యార్థులకు ప్రత్యేక బోధన చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. మెనూ పాటిస్తూ భో జనం వడ్డించాలన్నారు.



స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న ఏటీడీఓ దేశిరాం

నిధుల కేటాయింపుపై హర్షం



టపాసులు కాల్చుతున్న గ్రామస్తులు



పంబాపూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు, ప్రజలు

భూపాలపల్లి రూరల్: మండలంలోని అటవీ గ్రామాలకు రోడ్లు తదితర మౌలిక వసతుల కోసం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నిధులు కేటాయించినందుకు నాగారం గ్రామస్తులు బుధవారం గ్రామంలో టపాసులు కాల్చుతూ.. హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జ్యోతి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగేడు పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాంపల్లి శ్రీనివాస్, నాగారం గ్రామ ఉపసర్పంచ్ మల్లేష్, ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ భూతం తిరుపతి, పార్టీ నాయకులు చేకూరి రాజు, జోగ్యా నాయక్, నరేందర్, కుమార్, వెంకన్న, కొండ భాస్కర్, లక్ష్మణ్, క్రాంతి, రాజు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామాల్లో రోడ్లతో పాటు, మౌలిక సదుపాయల కల్పనకు నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటాలకు.. సర్పంచ్ బంటు అనూష రమేష్‌ల ఆధ్వర్యంలో గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు. మండలంలోని అటవీ గ్రామాలైనా రాంపూర్ నుంచి చికినపల్లి వరకు బీటీ రోడ్డు, రాజీవ్‌నగర్ నుంచి పంబాపూర్ వరకు, దూదేకులపల్లి నుంచి ధోనికెల్ల మడుగు వరకు, నాగారం నుంచి మీనాజీపేట, గొర్లబుద్దారం తండా నుంచి రాజు నాయక్‌తండా వరకు బీటీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు కేటాయించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకం చేసినట్లు సర్పంచ్ బంటు అనూష రమేష్ తెలిపారు. ఎంపీటీసీ దార ప్రశాంతవెంకన్న, ఉపసర్పంచ్ సమ్మయ్య, సాదం వెంకన్న, రాజు, రామచంద్రు, అనిల్, వెంకన్న, యూత్ కమిటీ నాయకులు రాజు, సుందర్, క్రాంతి పాల్గొన్నారు.

పెద్దవాగులో వృద్ధుడి మృతదేహం లభ్యం



మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని పెద్దవాగులో వృద్ధుడి మృతదేహం లభ్యమయిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం కరీంనగర్ జిల్లా ఇల్లంతకుండా మండలం భోగంపాడు గ్రామానికి చెందిన బోడపట్ల రాజిరెడ్డి (75) కొన్ని రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సమ్మక్క–సారలమ్మ జాతర సమీపంలోని పెద్దవాగులో మత్స్యకారులు చాపలు పడుతుండగా మృతదేహాన్ని గుర్తించి ఎస్సై శ్రీధర్‌కు సమాచారం అందించారు. ఎస్సై సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పరిశీలించి భోగంపాడుకు గ్రామానికి చెందిన బోడబట్ల రాజిరెడ్డి అని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.